క్లుప్తంగా

వైద్యులు సమయపాలన పాటించాలి



ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి

దేవరకొండ: దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు సమయపాలన పాటించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డు, జనరల్ వార్డు, ఓపీ నమోదు, సిబ్బంది పనితీరు వంటి వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది తదితరులున్నారు.

పెట్రోల్ బంకు తనిఖీ



పెట్రోల్ బంకులో రికార్డులు తనిఖీ చేస్తున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లోని పెట్రోల్ బంక్‌ను శుక్రవారం పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తనిఖీ చేశారు. పెట్రోల్ బంకుల్లో మరుగు దొడ్ల నిర్వహణ అపరిశుభ్రంగా ఉన్నా, తాళం వేసి ఉన్నా చర్యలు తప్పవన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నో స్టాక్ బోర్డు పెట్టొద్దని బంకు యాజమాన్యాలకు సూచించారు. నిల్వలు అయిపోక ముందే స్టాక్ తెప్పించాలన్నారు. ప్రతి పెట్రోల్ బంక్‌లో నాణ్యతను పరీక్షించే బ్లాటింగ్ పేపర్‌ను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీ

నిడమనూరు : నిడమనూరు ఆదర్శ పాఠశాలలో వివిధ తరగతులలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.నిర్మల తెలిపారు. 6వ తరగతిలో 34 సీట్లు, 7వ తరగతిలో 5, 8వ తరగతిలో 14, 9వ తరగతిలో 17, ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో 12, ఎంపీసీలో 3, బైపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులను అందజేసి, ఆయా తరగతుల్లో అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న సత్యం, నాయకులు

నిడమనూరు : సీఎం సహాయనిధితో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. నిడమనూరు మార్కెట్ యార్డులో శుక్రవారం 15 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4,12,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం మాట్లాడారు. సీఎం సహాయ నిధి పేదలకు ఆర్థికంగా ఎంతో భరోసా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ విజయ్‌కుమార్ గౌడ్, చెర్క శ్రీను, పోలె రవి, మెరుగు శ్రీను, రాజు, సుజయ్, బొల్లెపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగార్జునసాగర్ : స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు చేసుకునేందుకు నేటి నుంచి ఐదవ తేదీ వరకు అవకాశముందని కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లెక్చరర్ ఇన్ సివిల్ 4పోస్టులు, సీఎంఈ 2పోస్టులు, త్రిపుల్ఈ 3 పోస్టులు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీ బోధనకు ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మాడుగులపల్లి : మాడుగులపల్లి కేజీబీవీ జూనియర్ కళాశాలలో బోటని సబ్జెక్ట్ బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ సునీత శుక్రవారం తెలిపారు. ఎంఎస్సీ బోటని, బీఈడీ అర్హత కలిగి ఉన్న ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 4లోపు మాడుగులపల్లి కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ జోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ, బీఎస్సీ అర్హత కలిగిన మహిళా ఉపాధ్యాయులు ఈనెల 4వ తేదీ వరకు స్థానిక కస్తూరిబాగాంధీ విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సొంత ఊరి సేవలో తరిస్తూ..!

- గువ్వలగుట్టలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- 8 బోర్లు, 6 మోటార్ల బిగింపు
- గ్రామానికి సేవ చేస్తున్న రమావత్ రవి





రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్, మంచినీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

చందంపేట : సొంత ఊరిపై మమకారంతో తనకు తోచిన రీతిలో సేవలందిస్తున్నాడు రమావత్ రవి. దేవరకొండ నియోజకవర్గానికి దూరంగా గుట్టల్లో ఉండే గువ్వలగుట్ట గ్రామంలో జనం కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. కిడ్నీ బాధితుల కోసం రవి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా నీటిని అందిస్తున్నాడు. అలాగే విద్యుత్ మోటార్ల ఏర్పాటు, మరమ్మతులు చేయిస్తూనే జనానికి ఏకష్టం వచ్చినా అండగా నిలబడుతున్నాడు.

రెండు వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

గువ్వలగుట్ట గ్రామంలో ఇంటికొకరు కిడ్నీ బాధితులు ఉండడం, స్వచ్ఛమైన నీటి కోసం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రమావత్ రవి ఊరికి ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకొని ముందుకొచ్చాడు. ఎనిమిది నెలల క్రితం గువ్వలగుట్ట గ్రామంతో పాటు సేవాలాల్‌తండాలో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయించాడు. అక్కడ ఓ వ్యక్తిని నియమించి నెలనెలా జీతాలు ఇస్తూ గ్రామస్తులకు శుద్ధమైన జలాలను ఉచితంగా అందిస్తున్నాడు. మహిళలకు 155 వాటర్ క్యాన్లను అందజేభాడు. గ్రామంలో ఇప్పటి వరకు ఎనిమిది బోర్లు వేయించడంతో పాటు ఆరు బోర్లకు మోటార్లు సైతం బిగించాడు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తనవంతు తోడ్పాటునందిస్తున్నాడు.

తాగునీటి సమస్య తీరింది



చాన్నాళ్లుగా శుద్ధమైన నీరు దొరక్క గ్రామంలో చాలా మంది కిడ్నీ సమస్యతో బాధపడేవారు. ఫిల్టర్ వాటర్ కోసం 7 కిలోమీటర్ల దూరంలో సరైన రోడ్డు కూడా లేని కాచరాజుపల్లికి వెళ్లి తెచ్చుకునే వాళ్లం. ఇలా చాన్నాళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రవి ముందుకొచ్చి ఊళ్లో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడంతో మా సమస్య తీరింది.

– రమావత్ హరిసింగ్, గువ్వలగుట్ట

ఊరికి నా వంతు సేవ చేస్తా

ఊరి కోసం ఏదో ఒకటి చేయాలని, అలాగే మా తాత కంబాలపల్లి మాజీ ఎంపీటీసీ రమావత్ సోమ్లానాయక్ ఆదర్శంగా తీసుకున్నాను. సొంత ఊరి కోసం మనవంతుగా సేవ చేయడంలో ముందుండాలని మా తాత చెప్పే మాటలే నాకు స్ఫూర్తినిచ్చాయి. ఊరిలో వాటర్ ప్లాంట్, ఎనిమిది బోర్లు, ఆరు మోటార్లు ఏర్పాటు చేయించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నా.

– రమావత్ రవి, గువ్వలగుట్ట వాసి

గురుకుల విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

దేవరకొండ: యోగా సాధనలో దేవరకొండ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రియ తెలిపారు. గురువారం నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన 9మంది విద్యార్థినులు ఆయా విభాగాల్లో బంగారు, వెండి పథకాలు సాధించినట్లు పేర్కొన్నారు. సీనియర్ విభాగంలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు ఈనెల 6, 7తేదీల్లో అదిలాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుండగా మరో ఆరుగురు విద్యార్థినులు జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరిని శుక్రవారం ప్రిన్సిపాల్ హరిప్రియ, వైస్ ప్రిన్సిపాల్ శ్వేత, పీడీ మహేశ్వరి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, న్యాయమూర్తి స్వప్న

నిడమనూరు : పరిశ్రమల నిర్వాహకులు సామాజిక బాధ్యతగా వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో వజ్రతేజ రైస్‌మిల్ ఆధ్వర్యంలో రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఆయన న్యాయమూర్తి టి.స్వప్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ కక్షిదారులకు వాటర్‌ప్లాంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ సాధన, ఏజీపీ ఉన్నం చిన వీరయ్య, వజ్రతేజ రైస్‌మిల్ ఎండీ చిట్టిపోలు యాదగిరి, న్యాయవాదులు పెద్దబోయిన శ్రీనివాస్‌యాదవ్, బీఎస్ఎన్ రాజు, అబ్దుల్ హలీమ్, వినోద్, స్వర్ణలత, మన్మథరెడ్డి, కోర్టు సూపరింటెండెంట్ శర్మ, రైస్‌మిల్ పార్టనర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్

మిర్యాలగూడ : ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ జడ్పీ హైస్కూల్, బొత్తలపాలెంలోని మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు విజృంభించకుండా పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని, మూత్రశాలలు, స్నానపు గదులు ప్రతిరోజు శుభ్రం చేయాలన్నారు. బాలికల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థుల విద్యాభ్యాసన స్థాయిని పెంచాలన్నారు. అనంతరం కొండ్రపోల్ గ్రామపంచాయతీలో మురుగు కాల్వలను పరిశీలించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలని ఆయన పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ప్రధానోపాధ్యాయుడు బాలు, నరహరి, పంచాయతీ కార్యదర్శి శారద తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

కొండమల్లేపల్లి: అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వేతనాలు పెంచి కేంద్రాలను బలోపేతం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎడమ సుమతమ్మ కోరారు. శుక్రవారం కొండమల్లేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.18వేల వేతనం చెల్లించాలన్నారు. కేంద్రాల అద్దెలు, గ్యాస్, ఆరోగ్య లక్ష్మి బిల్లులు ప్రతి నెలా చెల్లించాలని తెలిపారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ.. ప్రసవించిన గంటలో బిడ్డకు తల్లి ముర్రుపాలను తప్పకుండా పట్టించాలన్నారు. ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం 8వ నెల నిండిన గర్భిణుల గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పూలమ్మ, పద్మ, వనజ, కిష్టమ్మ, లక్ష్మి, సైదాభి, మణెమ్మ, అంజలి, సుచిత, అరుణ, అంజమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకమే నేస్తం కావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ వికాస వేదిక కన్వీనర్ ప్రభాకర్, ఎంఈఓ శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థుల మానసిక ఎదుగుదలకు పుస్తకమే నేస్తం కావాలని తెలంగాణ వికాస వేదిక కన్వీనర్, గ్రంథాలయ ఉద్యమ ప్రచారకుడు కస్తూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తకాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ల మత్తులో మగ్గుతున్న విద్యార్థులను ప్రతి రోజు ఒక పుస్తకం చదివేలా ప్రేరేపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల విద్యాధికారి శ్రీనివాస్‌తో కలిసి పుస్తకపఠనం ఆవశ్యకతను తెలియజేసే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించిన విద్యార్థులు



ఐఐటీ హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

త్రిపురారం : విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్యపై చైతన్యం కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామని ఆల్ఫా ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సలీం అన్నారు. శుక్రవారం ఆల్ఫా ఉన్నత పాఠశాల 9వ, 10వ తరగతి విద్యార్థులు ఐఐటీహెచ్ ఆర్‌డీసీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)–హెచ్‌లోని ఆధునిక తరగతి గదులు, పరిశోధన ప్రయోగశాలలు, ఇన్నోవేషన్ హబ్‌లు, హాస్టళ్లను పరిశీలించారు. అధ్యాపకులతో ముఖాముఖి చర్చల ద్వారా జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్‌ల ప్రాముఖ్యత, సబ్జెక్ట్ అంశాలు, ఐఐటీలో చేరితే కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రహీమ్ సోహెల్, ఉపాధ్యాయులు మహమ్మద్ ఫాతీమున్నిసా, సయ్యద్ రిజ్వాన పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

మిర్యాలగూడ : పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ దామరచర్ల మండలం వీర్లపాలెంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను ముందు చూపుతోనే ఏర్పాటు చేశారని, నేడు అది పూర్తయి మొదటి యూనిట్‌ను ప్రారంభిస్తున్నారని అన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పవర్ ప్లాంట్‌ను నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శివనాయక్, చిన్నాల అంజియాదవ్, శ్రీధర్‌నాయక్, అభినాయక్, అజయ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి ఏపీఎంగా యాదయ్య



యాదయ్యకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ఏపీఎంగా యాదయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పని చేసిన శ్రీనివాస్ నల్లగొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దేవరకొండలో పనిచేస్తున్న యాదయ్య కొండమల్లేపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది సత్తయ్య, రమేష్, రవి, రాజు, సంధ్య, లలిత తదితరులున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

వేములపల్లి : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దీన సుజాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నికల సరళిపై అవగాహన పెంచుకున్నారు. మాక్ పోలింగ్‌లో చురుకైన పాత్ర పోషించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, నయిమున్నీసా, ఖలీల్, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ దీన సుజాత

టెయిల్‌పాండ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



టెయిల్‌పాండ్ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి గ్రామ సమీపంలో గల టెయిల్‌పాండ్ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. 7 గేట్లను 3.50 మీటర్ల ఎత్తు లేపి దిగువన ఉన్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నుంచి 2,38,964 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా టెయిల్‌పాండ్ నుంచి దిగువకు 2,32,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నాయీ ఫిల్లర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం



సన్మానిస్తున్న నాయీ ఫిల్లర్స్ ఫౌండేషన్ నిర్వాహకులు

మిర్యాలగూడ టౌన్ : విద్యలో ప్రతిభ కనబరిచిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులను శుక్రవారం పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో నాయీ ఫిల్లర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవల్లి ఉపేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలగడప గిరిధర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నాయీ ఫిల్లర్స్ ఫౌండేషన్ ఎంపిక చేసి ప్రోత్సాహకంగా నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ ఏడాది రాయించు భవ్యకు రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, నాయకులు ఎలుగుబెల్లి కృష్ణమూర్తి, నర్సింహ, సైదులు, యాదగిరి, నాగవెల్లి యాదగిరి, హనుమంతు, వెంకట్, రమేష్, నగేష్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతచెట్టుతండాకు చెందిన నేనావత్ కుమార్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇస్లావత్ అభిషేక్ రూ.10వేలను వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బద్దు, రమావత్ శివ, నేనావత్ దేవేందర్, అంజి ఉన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునీర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు బాలాజీ, విజేందర్, నాగు, భవానిరెడ్డిలు రోగులను పరీక్షించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోయిజ్, మాజీద్, మౌజం హుస్సేన్, యాదగిరి, వెంకటేశ్వర్లు, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న జనమైత్రి ఫౌండేషన్ సభ్యులు

మార్కండేయ దేవాలయంలో పూజలు



మార్కండేయ దేవాలయంలో వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

దేవరకొండ: శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా దేవరకొండ పట్టణ శివారులోని శ్రీభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భవాని మృత్యుంజయేశ్వర దుర్గామాత అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు వనం జగదీశ్వర్, మన్న మణిదీప్, చేరిపల్లి ఎల్లయ్య, చిలువేరు చంద్రమౌళి తదితరులున్నారు.

కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

నల్లగొండ టౌన్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 50 సంవత్సరాలు నిండిన కార్మికులందరికీ కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య కోరారు. శుక్రవారం నల్ల గొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో నిర్వహించిన రాడ్ బైండింగ్ బ్యాచ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి ఉపకార వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు బైకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, సలివోజు సైదాచారి, అద్దంకి నరసింహ, ఎస్కే మదర్, నాగేంద్ర చారి, మహమ్మద్, రాజేష్, కత్తుల అంబేద్కర్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కళాకారుల కళాజాతా

హాలియా : అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందం నల్లగొండ ఆధ్వర్యంలో శుక్రవారం కళాకారులు కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలు తదితర అంశాలపై ఆటాపాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రియాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, బీమనపాటి శివారెడ్డి, నర్సింగ్ నాగయ్య, సాంస్కృతిక కళా బృందం సభ్యులు బందెల మల్లిక, బచ్చలకూరి శ్రీనివాస్, కత్తుల శంకర్, నాగిళ్ల కొండల్, మోగుదాల సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు